ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 7 జూలై 2025

పమేరియన్.. బీగిల్.. చౌచౌ



కాకార్‌స్పానియల్, బీగిల్, చౌచౌ, సైంట్ బెర్నర్డ్, లాసాతిప్సో, రోటవీలర్, షిజు, డాల్‌మిషన్, జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, బాక్సర్, ఫగ్, పమేరియన్, డాబర్‌మెన్.. ఇలా, అరుదైన శునకాలతో ఆదివారం పశువైద్యశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు జిల్లాలో రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. తిరుపతిలో 602 శునకాలు, నాలుగు పిల్లులకు వ్యాక్సిన్ వేశారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



కాలినడకన తిరుమలకు గోవు

తిరుమల గోవిందుడి సేవకు భక్తులతో కలసి ఓ గోవు కూడా కాలినడకన తిరుమల కొండెక్కడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా అలిపిరి మెట్ల మార్గంలో కాలినడకన వచ్చేందుకు భక్తులు ఆపసోపాలు పడుతుంటారు. ఓ గోవు మాత్రం ఎలాంటి అలసటకు గురికాకుండా ఆదివారం ఉదయం భక్తులందరితో కలిసి కాలినడకన తిరుమల చేరుకుంది. కోట్లాది దైవాలకు స్వరూపంగా ఆరాధించే గోవు గోవిందుడి సన్నిధికి ఇలా కాలినడకన రావడాన్ని చూసిన పలువురు భక్తులు తమ వద్దనున్న పండ్లు పెట్టడంతో పాటు నీరు తాగించి సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రజెండాకు వందేళ్లు

భారతగడ్డపై 'ఎర్రజెండా'కు వందేళ్లయిన సందర్భంగా ఆదివారం తిరుపతిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ పటిష్ఠతకు గ్రామ, డివిజన్, మండల, జిల్లా స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రతి చోట వంద చెట్లు, వంద జెండాలు నాటాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కొన్ని మొక్కలు నాటారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



సత్యవేడు టీడీపీకి కొత్త సారథి

- కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని నేడు శ్రేణులకు పరిచయం చేయనున్న మంత్రి అనగాని
- పార్టీతో ఆదిమూలం అనుబంధం ముగిసినట్టేనా?
- సత్యవేడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలు

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు టీడీపీ తెర మీదకు హఠాత్తుగా కొత్త పేరు ప్రత్యక్షం కావడం రాజకీయ చర్చకు దారితీసింది. తాజా పరిణామాలు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని నియమిస్తున్నట్టు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ నుంచి ఎమ్మెల్యే ఆదిమూలంను సస్పెండ్ చేసిన తర్వాత కో ఆర్డినేటర్‌గా శ్రీపతి బాబు, ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలంగా ఉన్నారు. తనపై ఫిర్యాదునే ఉపసంహరించుకున్నందున సస్పెన్షన్‌ను ఎత్తేయాలని ఆదిమూలం కోరినప్పటికీ పార్టీ అధినేత సానుకూలంగా స్పందించలేదు. ఈ దశలోనే పార్టీ కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని ప్రకటించారు. ఈ పరిణామం.. ఆదిమూలం పట్ల టీడీపీ వైఖరిని మరింత స్పష్టం చేసినట్లే అని భావిస్తున్నారు.

ఇక కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని పార్టీ శ్రేణులకు పరిచయం చేసి, అధినేత ఆదేశాలను వివరించేందుకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యవేడు పర్యటన పెట్టుకున్నారు. ఆదివారం తిరుపతి చేరుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నానికి సత్యవేడు చేరుకోనున్నారు. అక్కడ తొలుత బేరిశెట్టి కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా శ్రేణులకు కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డిని పరిచయం చేయనున్నారు. ఆపై తొలి అడుగు కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌తో పాటు పాల్గొననున్నారు. రాత్రికి సత్యవేడులోనే బస చేసేలా ఆయన పర్యటన షెడ్యూలు ఖరారైంది. దాన్ని బట్టి చూస్తే అటు పార్టీ వర్గాలతో పాటు ఇటు అధికార వర్గాలకు కూడా కో ఆర్డినేటర్‌ను పరిచయం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పార్టీ బాధ్యులు ఎవరనే స్పష్టతనివ్వడానికే అని భావిస్తున్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

ఏడాదిలోనే మార్పులు

సత్యవేడు నియోజకవర్గ రాజకీయాలు ప్రతి ఐదేళ్లకూ మార్పునకు లోనుకావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పర్యాయం మాత్రం ఎన్నికలు జరిగిన ఏడాదికే రాజకీయ నాయకత్వం తారుమారు కావడం గమనార్హం. ఏడాది కిందట వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం అనూహ్య పరిణామాల నడుమ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. టీడీపీలో చేరి టికెట్ తెచ్చుకుని ఎన్నికల్లో గెలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కుదురుకునేలోపే భారీ కుదుపునకు లోనయ్యారు. పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురై రాజకీయ జీవితంలో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆయన సస్పెన్షన్ తర్వాత తొమ్మిది నెలల గడువు దొరికినా ఇతర ఆశావహులు ఆ శూన్యతను సద్వినియోగం చేసుకోలేదు. మాజీ ఎమ్మెల్యే హేమలత గానీ, ఆమె కుమార్తె గానీ, కోఆర్డినేటర్ శ్రీపతి గానీ, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు గానీ పరిస్థితులను అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయలేదని అంటున్నారు. ఆ వ్యవధిలో అధిష్ఠానం అనేక కోణాల్లో కసరత్తు చేసి కేఎస్ఆర్ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని సమన్వయకర్తగా తెర ముందుకు తెచ్చిందని అంటున్నారు. విశేషం ఏమిటంటే.. పార్టీలో అన్ని వర్గాలూ ఆయన రాక పట్ల సానుకూలంగానే వున్నాయి. చివరికి సస్పెన్షన్‌లో వున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ కూడా శంకర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కలసికట్టుగా సత్యవేడును అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు కూడా ఇచ్చారు. ఈ పరిణామాలు సత్యవేడులో టీడీపీ పటిష్టపడడానికి ఎంతమేరకు దారితీస్తాయో చూడాలి.

వైభవం.. అగ్నిగుండ ప్రవేశం



ద్రౌపదీ దేవికి నిప్పులతో ఒడి కడుతున్న ప్రధాన అర్చకుడు

నిప్పులు తొక్కేందుకు కంకణధారులై వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధం.. ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశ వైభవంగా జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధలో భాగంగా వారి ప్రతిమలు ఏర్పాటు చేసి నాటకాన్ని రక్తి కట్టించారు. సాయంత్రం అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అగ్ని గుండం నుంచి నుంచి నిప్పు కణికలను తీసుకుని ద్రౌపదీ అమ్మవారి ఒడిలో కట్టారు. గుండంలో ప్రధాన అర్చకుడు మల్లెపూల చెండు విసిరారు. ఆ తర్వాత ఆలయం తరపున కలశం, పోతురాజు, గెరికను తీసుకుని అగ్నిగుండం ప్రవేశించారు. వీరి వెంట 4,394 మంది భక్తులు పసుపు దుస్తులు, కంకణాలు ధరించి వేపమండలు చేతబట్టి పూల కిరీటాలు, కళ్లకు కాటుకతో క్యూకట్టారు. గోవింద నామ స్మరణతో అగ్నిగుండంలో నడుస్తూ ఎదురుగా వాహనంపై ఆసీనులైన ద్రౌపదీదేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈసారి మహిళా భక్తులు కూడా విశేషసంఖ్యలో నిప్పులుతొక్కారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



నిప్పుల్లో పూలచెండు వేసి బయటకు తీశారిలా..



చిన్నారితో కలిసి నిప్పులు తొక్కుతున్న భక్తుడు

కూటమితోనే బీసీల ఆత్మగౌరవం

- ఏదైనా సాధించే వరకు సంఘటితంగా ఉండాలి
- భరోసా సభలో మంత్రుల పిలుపు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలు ఆత్మగౌరవంతో నిలబడ్డారు' అంటూ మంత్రులు పేర్కొన్నారు. తిరుపతిలో ఆదివారం ఏపీ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్- పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ ఆత్మగౌరవ భరోసా సభలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు బీసీల బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో పాతినిధ్యం తదితర విషయాల్లో బీసీల దామాషా ప్రకారం హక్కులు సాధించాలంటే అందరూ ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐతే మనం పోరాటం చేయాల్సిన అవసరం లేకుండానే కూటమి ప్రభుత్వం తగిన ప్రాతినిధ్యం కల్పిస్తోందన్నారు. ఏ ప్రభుత్వం కేటాయించనివిధంగా ఉన్నత పదవులు ఇచ్చిందన్నారు. సంఘటితంగా ఉండి మన పోరాట శక్తిని సమాజానికి చాటకపోతే బీసీ ఆత్మగౌరవ సభకు అర్థమే ఉండదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. పోరాటం ప్రారంభిస్తే సాధించేవరకు విడవనప్పుడే కోరుకున్న ఫలితం వస్తుందన్నారు తమ ఐదేళ్ల అధికారంలో బీసీల బాగోగులను గాలికొదిలి.. దాడులు చేసిన వైసీపీ నేతలు, ఇప్పుడు మళ్లీ న్యాయం చేస్తామంటూ నాటకాలు మొదలు పెట్టారన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో బీసీల సంక్షేమం మళ్లీ ప్రారంభమైందన్నారు. ఎన్టీఆర్ చూపిన దిశ, దశలో సీఎం చంద్రబాబు నడుస్తూ బీసీలకు పెద్దపీట వేస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత చెప్పారు. రంగులరెడ్డి, పెలివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ద్రోహి అని అభివర్ణించారు. బీసీల ఓట్లు వేయించుకుని బీసీ భవన్‌లను నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి బీసీలకు సముచి స్థానాన్ని కల్పించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాధాన్యమిస్తున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎస్సీ ఎస్టీలవలే బీసీల రక్షణకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పరసారత్నం, మోహన్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, సదాశివ, అనిత, సభాధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్, ఆల్‌మన్ రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేసర శంకరావు, కాంతికుమార్, జానపద వృత్తి కళాకారుల సంఘం నేత యాదగిరి, పంజాబ్‌కు చెందిన బీసీ సంఘం నేత కుమరన్‌సింగ్, హరియాణా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పంజాబ్ నేత కుమరన్‌సింగ్ తమ ఆచారం ప్రకారం బహూకరించిన కత్తులతో వేదికపై అతిథులు

నేడు అధికారులతో మంత్రి అనగాని సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4పై జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు సత్యవేడుకు చేరుకుని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనున్నారు.

ఈనెలలో రెండుసార్లు గరుడసేవ

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి ఈనెలలో రెండు సార్లు గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. జూలై10న గురుపౌర్ణమి, 29న గరుడ పంచమి సందర్భంగా శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి ఆలయ నాలుగుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవ జరుగనుంది.

ఈఏపీ సెట్ వెబ్ ఆప్షన్స్ నమోదు తేదీల్లో మార్పు

- 13 నుంచి 18వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకుగాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్-2025 వెబ్ ఆప్షన్ల నమోదు తేదీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం నుంచి ఈఏపీ సెట్ వెబ్ కౌన్సిలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ముందుగా సాంకేతిక విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఐతే వెబ్ ఆప్షన్ల నమోదు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 10వ తేదీ నుంచి కాకుండా 13వ తేదీ నుంచి ప్రారంభమౌతాయని ప్రకటించారు. విద్యార్థులు ఈ అంశాన్ని గుర్తించి ఆయా తేదీల్లోనే వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.



కోట ప్రాంతంలో కనెక్షన్లు తనిఖీ చేస్తున్న డీపీఈ అధికారులు

రైతులు విద్యుత్ అదనపు లోడ్‌ను పెంచుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుపతి సర్కిల్ పరిధిలో ఆక్వా చెరువులు నిర్వహిస్తున్న రైతులు తమ విద్యుత్ వియోగానికి సంబంధించిన లోడ్‌ను పెంచుకోవాలని డీపీఈ విజిలెన్స్ విభాగం ఈఈ గంగాధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం కేంద్రంగా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా శనివారం రాత్రి కోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో వాకాడు, చిట్టమూరు సెక్షన్ల పరిధిలో ఆక్వా చెరువుల విద్యుత్ కనెక్షన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశామన్నారు. ఆ ప్రాంతంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లు లేవన్నారు. కొంత మంది రైతులు సర్వీసు తీసుకున్న సమయంలో పొందుపరచిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ లోడ్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న రైతులు అదనపు లోడ్‌కు తగిన మొత్తాన్ని చెల్లించుకోవాలని తెలిపారు.



తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మురళి

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం

భాకరాపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని, ప్రస్తుత పాలకులు దాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేశ్, మునస్వామి నాయుడు, రెడ్డప్పరెడ్డి, మునిరాజా పాల్గొన్నారు.

వెంకట్రామాపురంలో పారిశుధ్య చర్యలు

రామచంద్రాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వెంకట్రామాపురం కుంటలో కొన్నాళ్లుగా పేరుకుపోయిన చెత్త నిల్వలను సెవెల్‌హిల్స్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం, గ్రామస్తులు కలిసి ఆదివారం తొలగించారు. అలాగే గ్రామంలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.



కుంటను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

టీడీపీ పాలనలోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం: జూలై 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. రాయలచెరువపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాధవయ్య, నాగభూషణం, సుబ్రహ్మణ్యం, గణేష్, యువరాజు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి కళాతరంగిణి సంస్థకు చెందిన కళాకారులు లహరి, భరత్, శృతి, భార్గవి, రమ్య, హేమంత్, సంగీత, జశ్వంత్, వర్షిణి, కుషాల్ తదితరులు మహాగణపతి మనసాస్మరామి, శివశివ శంభో శంకర, మురిపాల వన్నెల రాధ, యదుకుల నంద, భజరే నందగోపాల హరే వంటి భక్తిగీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. వారిని శిల్పారామం ఏవో సుధాకర్ సత్కరించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

గురుభక్తిని చాటుకున్న ఏకలవ్యుడు



ఏకలవ్యుడికి నివాళి అర్పిస్తున్న కాలనీ వాసులు

తిరుచానూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుడు బొటనవేలిని ద్రోణాచార్యుడికి గురుదక్షిణగా సమర్పించి తన గురుభక్తిని చాటుకున్నాడని ఏకలవ్య కాలనీ వాసులు అన్నారు. ఏకలవ్యుడి జయంతి సందర్భంగా కొరమేనుగుంట ఏకలవ్య కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏకలవ్యుడు మహావీరుడు, మానవత్వమున్న ధీశాలి అని కొనియాడారు. తమ కాలనీలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని వారు సంకల్పించారు. కార్యక్రమంలో రచయిత వెంకట్రామయ్య, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు సి.వి.కృష్ణయ్య, ఎస్‌బీఐ విశ్రాంత మేనేజరు శంకర్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్బరామయ్య, పాండురంగయ్య, మల్లికార్జున, సూర్యప్రకాష్, గంగన్న పాల్గొన్నారు.

ఎస్వీయూలో జాబ్‌మేళా

● ఉద్యోగాలకు 24 మంది ఎంపిక



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని ప్రకాశం భవన్‌లో ఆదివారం జాబ్‌మేళా చేపట్టారు. ఎంఆర్‌ఎఫ్ టైర్స్ ఈ మేళాలో పాల్గొంది. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే యూనివర్సిటీలో ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి జాబ్‌మేళాలు చేపట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు వివరించారు. కాగా, ఎంఆర్‌ఎఫ్ కంపెనీ అరక్కోణం ప్లాంట్ హెచ్‌ఆర్ వెంకటరమణన్, ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణ నేతృత్వంలో జాబ్ మేళాకు హాజరైన విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పరీక్షించారు. 53 మంది హాజరుకాగా, 24 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నెలకు రూ.22 వేల వేతనం అందించనున్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు.



అరుదైన శునకజాతుల సందడి

● ఘనంగా జూనోసిస్ డే



వీసీసీలో వ్యాక్సిన్ వేస్తున్న డీన్ వీరబ్రహ్మయ్య. పక్కన ఏడీ జగపతిరామయ్య, వీసీసీ హెడ్ వైకుంఠరావు తదితరులు

తిరుపతిరూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): అరుదైన నాటు శునకజాతులతో ఆదివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, తాతయ్యగుంటలోని పట్టణ పశువైద్యశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్(వీసీసీ), పట్టణ పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు(శునకాలు, పిల్లులు) ఫ్రీ వ్యాక్సినేషన్(రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు) కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు యజమానులు తమ పెంపుడు జంతువులను తీసుకొచ్చి వ్యాక్సినేషన్ చేయించారు. మొత్తం 606 పెంపుడు జంతువులకు (శునకాలు 602, పిల్లులు4) వ్యాక్సినేషన్ చేసినట్లు వీసీసీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు వివరించారు. వెటర్నరీ వర్సిటీలో నిర్వహించిన జూనోసిస్‌డేకి డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతి రామయ్య హాజరయ్యారు. ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీసీసీ హెడ్ వైకుంఠరావు మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులు, శిలీంధ్రాల వల్ల జూనోటిక్ వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయన్నారు. మూడు నెలలు దాటిన కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అలాగే జంతువులకు క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు వస్తాయని, రక్తపరీక్షలు, స్కాన్, ఎక్స్‌రే వంటివి చేసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ రఘునాథ్, డాక్టర్ భారతి, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శివనాగరాజు, పట్టణ పశువైద్యశాల వైద్యులు డాక్టర్ విజ్ఞత, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ కళ్యాణ్ శివమనోహర రావు పాల్గొన్నారు.



తమిళనాడు గవర్నర్‌కు టీటీడీ చైర్మన్ స్వాగతం

తిరుమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్వాగతం పలికారు. అనంతరం పద్మావతి గెస్ట్‌హౌస్‌లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శేఖర్‌రెడ్డితో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

బాలగుర్రప్ప స్వామి ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం

భాకరాపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం లంకిపల్లివారిపల్లెలో వెలసి ఉన్న బాల గుర్రప్పస్వామి ఏకాదశి ఉత్సవాలను ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం స్వామి, అమ్మవారిని భద్రపరిచిన మందసం దించి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం హోమం నిర్వహించారు. అంగన్యాస, కరణ్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హోమం నిర్వహిస్తున్న పురోహితులు



కోటిలింగేశ్వరస్వామి సేవలో కంచిపీఠం ఉత్తరాధికారి



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న కంచి పీఠం ఉత్తరాధికారి

రామచంద్రాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామిని ఆదివారం కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారి సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి ఆలయంలో కోటిలింగేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి తిరుమంజనం



రామచంద్రాపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వర స్వామి ఉపాలయంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం వైభవంగా తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉభయదాత అబ్బూరి దేవరాజులునాయుడు దంపతులు పాల్గొన్నారు.

మత్తులో యువకుడి వీరంగం

చంద్రగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి నరసింగాపురం రైల్వే గేటు వద్ద ఓ వ్యక్తి మత్తులో వీరంగం సృష్టించాడు. మండలంలోని నరసింగాపురానికి చెందిన ప్రవీణ్ రైల్వే గేటు వద్ద ఉన్నాడు. ఆ దారిలో వెళుతున్న ఆటోలో నుంచి స్పీడు బ్రేకర్ల వద్ద సామాన్లు కిందపడ్డాయి. ప్రవీణ్ ఆటో వాళ్లకు ఆ సామాన్లు అందిస్తుండగా అదే గ్రామానికి చెందిన శివ మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తితో ప్రవీణ్‌పై దాడికి ప్రయత్నించాడు. అడ్డుకునే ప్రయత్నంలో గ్రామానికి చెందిన భాగ్యరాజ్ చేతికి గాయమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని విషాదాంతం

● కర్నూలు జిల్లా బనవాసి కళాశాలలో ఆత్మహత్య



మృతి చెందిన రిషిత

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఏపీఆర్ జేసీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న రిషిత (17) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కళాశాల అధికారులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన మస్తానయ్య, మంజుల కుమార్తె రిషితకు బైపీసీ గ్రూపులో సీటు వచ్చింది. వారం రోజుల క్రితం రిషిత తల్లిదండ్రులు బనవాసి కళాశాలలో వదిలివెళ్లారు. ఇక్కడ ఉండలేనని రోజూ తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుండేది. దీంతో ఆదివారం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి సాయంత్రం వరకు రిషితతో గడిపారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని రిషితమానసిక ఆందోళనకు గురై. రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్ బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకుంది. కాసేపటి తర్వాత కళాశాల వర్గాలు గుర్తించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్యలత సమాచారంతో పోలీసు చేరుకొని బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వారు నిర్ధారించారు.


లోకేశ్‌కు ఘన స్వాగతం



తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కలెక్టర్ వెంకటేశ్వర్.. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బీజేపీ నేత కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం

చనిపోయిన ఏనుగు కోసం వచ్చి

గజరాజుల గుంపు బీభత్సం



ఏనుగు కళేబరాన్ని పూడ్చిపెట్టిన స్థలంలో గజరాజుల పాదముద్రలు

● కళేబరాన్ని పూడ్చిపెట్టిన గుంతను తవ్వేందుకు యత్నం

● ఆగ్రహంతో సమీపంలోని పంటలపై దాడి

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలోని పెద్దఒడ్డు చెరువు కట్టకింద 17 ఏనుగుల గుంపులోని ఒక ఏనుగు శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటికి వెళ్లిపోయిన మిగతా ఏనుగుల్లో కొన్ని శనివారం రాత్రి అదే ప్రాంతానికి తిరిగొచ్చాయి. నాలుగు గజరాజులు మాత్రం చనిపోయిన ఏనుగు జాడ కోసం గాలించాయి. అప్పటికే ఏనుగు కళేబరాన్ని అటవీశాఖాధికారులు ఖననం చేసి ఉండటంతో ఆ ప్రాంతాన్ని గుర్తించాయి. కళేబరాన్ని పూడ్చిపెట్టిన గుంతను తవ్వడానికి యత్నించాయి. కుదరకపోవడంతో ఆగ్రహించాయి. సమీపంలోని గుర్రప్ప.. వరిపంటను తొక్కేశాయి. బోడిరెడ్డిగారిపల్లెలోని కోదండయ్య.. టమోటా పంటను ధ్వంసం చేసి అడవిలోకి చేరుకున్నాయి. మిగిలిన ఏనుగులు కల్లూరు సమీపంలోని రఫీ, సాధిక్, మహబూబ్‌ఖాన్, ఖాదర్‌బాషా, అమ్ములకు చెందిన మామిడిచెట్లను, రాతికూసాలను విరిచేశాయి. కల్లూరు ఘాట్‌రోడ్డు సమీపంలో మామిడితోటలో ఉన్న ఓ ఇంటిని ఏనుగుల గుంపు చుట్టుముట్టాయి. ఆ ఇంట్లోని వ్యక్తి భయాందోళనకు గురయ్యాడు. గమనించిన అటవీశాఖ సిబ్బంది.. టపాకాయలు పేల్చడంతో ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయాయి.



వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏనుగు చనిపోయిన ప్రాంతానికి ఏనుగుల గుంపు మళ్లీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో శ్రీదేవి హెచ్చరించారు. ఈ ప్రాంతంలో రాత్రిపూట ప్రజలు బస చేయొద్దని, తెల్లటి దుస్తులు ధరించి తిరగొద్దని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. భాకరాపేట ఘాట్ రోడ్డులోని లోయలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని 40 అడుగుల లోతు గల లోయలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆధారాలు ఏమీ దొరకలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అధికారుల హామీతో దీక్ష విరమణ



కార్మికులతో మాట్లాడుతున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి(వైద్యం), జూలై 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ పది రోజులుగా దీక్షలు చేస్తున్న స్విమ్స్ కార్మికులు అధికారుల హామీతో శాంతించారు. టీటీడీ, స్విమ్స్ అధికారులు సానుకూలంగా స్పందించడంతో దీక్ష విరమించినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్విమ్స్‌లో కార్మికులకు హోదా, జీతాలు పెంచడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో దీక్ష చేయాల్సి వచ్చిందని తెలిపారు. కాగా, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఆర్డీవో రామ్మోహన్‌రెడ్డి, ఏఎస్పీ రవిమనోహరాచారి కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దాత రంజిత్

తిరుపతి అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షరయజ్ఞం స్టడీసెంటర్ పేద విద్యార్థులకు దాత రంజిత్ ఆదివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పెన్నులు, పెన్సిళ్లు, స్నాక్స్ వితరణ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ మరుపూరి శేఖర్ దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ గోపమ్మ, శ్వేత పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు ఘనస్వాగతం



తిరుపతి రైల్వే స్టేషన్‌లో మంత్రి సత్యకుమార్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

తిరుపతి(సెంట్రల్)/ ఉపాధ్యాయనగర్, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఆదివారం రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభించింది. బీజేపీ నేతలు గుండాల గోపినాథ్‌రెడ్డి, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, టి.సుబ్రమణ్యం రెడ్డి, జె.మధుసూదన్, బాలభాస్కర్ మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి, కండువాలతో సత్కరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



పరిటాల సునీత, శ్రీరామ్

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సీనియర్ ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణభట్, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

తిరుమలలో అదనపు ఎస్పీ తనిఖీలు



తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అదనపు ఎస్పీ రామకృష్ణ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, ఫారెస్ట్, బాంబ్ స్క్వాడ్, ఫైర్, రెవెన్యూ విభాగాలతో కలిసి కార్డన్ సెర్చ్ చేశారు. 150 దుకాణాలను తనిఖీ చేయగా అందులో 40 మంది అనధికారికంగా నడుపుతున్నట్లు గుర్తించి టీటీడీ, ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. దుకాణదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీరాముడు, ఎస్ఐలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనంతో ముగిసిన పీర్ల పండుగ



గాలివీధి నుంచి పీర్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న యువకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం నిమజ్జన కార్యక్రమంతో పీర్ల పండుగ ముగిసింది. నాలుగు రోజులుగా నగరంలో పీర్ల పండుగ నిర్వహించారు. చింతకాయల వీధి, పెద్దకాపువీధుల్లో ఉన్న పీర్ల చావళ్లలో ఏడవ రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు భక్తులు పీర్లకు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశంతో కార్యక్రమం ముగిసింది. రాత్రి పీర్లను పురవీధుల్లో ఊరేగింపుగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉన్న దర్గా వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో భాగంగా యువకుల ప్రత్యేక విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

తిరుపతి

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.33 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,536
తలనీలాలు సమర్పించినవారు: 35,120

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, బాలచంద్ర

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 6(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రెస్‌క్లబ్ సభ్యుల పిల్లలకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు మరింత బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

జగజ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఘన నివాళి అర్పించింది. జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా తిరుపతిలో ఆయన విగ్రహానికి రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. దేశానికి జగజ్జీవన్‌రామ్ గొప్ప సేవ చేశారని కొనియాడారు. ప్రభాకరనాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



జయంతి సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక ఎమ్మార్‌పల్లె కూడలి సమీపంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. సత్యకుమార్ మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ హిందువుల రక్షణ కోసం ఎంతగానో పాటుపడ్డారన్నారు. ముఖ్యంగా కాశ్మీర్‌లోని హిందువుల కోసం పోరాడారన్నారు. బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, జల్లి మధుసూదన్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నడక సాధ్యమేనా?

- సీబీఎస్‌లో ఎటుచూసినా పగిలిన మెట్లు, టైల్స్, ప్లాట్‌ఫామ్స్
- గాయాలపాలవుతున్న ప్రయాణికులు






చిత్తూరు ప్లాట్‌ఫాం వద్ద ఎత్తుగా ఉన్న మెట్లు, పగిలిన టైల్స్‌పై నడుస్తున్న వృద్ధుడు, పునాదులు కదిలిన ప్లాట్‌ఫాం, కాణిపాకం ప్లాట్‌ఫాం వద్ద ఎలుకల కలుగులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 6(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో నడవాలంటే ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. ఏ మూల చూసినా పగిలిన మెట్లు, టైల్స్, ప్లాట్‌ఫామ్స్ కనిపిస్తున్నాయి. ఆవరణ మొత్తం గుంతలు తేలిపోయి ఉంది. దీంతో బస్సుల కోసం అటు ఇటు తిరుగుతున్న ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ప్లాట్‌ఫామ్స్ అంచుల్లో ఎలుకల కలుగులు లెక్కలేనన్ని ఉన్నాయి. బస్సులు ఢీకొని దెబ్బతిన్న ప్లాట్‌ఫామ్స్ వద్ద పునాదిరాళ్లు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికులు అదుపుతప్పి కిందపడుతున్నారు. చిత్తూరు బస్సులు ఆగే స్థలంలో మెట్లు ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందిపడుతున్నారు. నిరీక్షణ హాల్స్‌లోనూ టైల్స్ పగిలిపోయాయి. ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు వచ్చే బస్టాండు ఇలా ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తిరుచానూరు ప్లాట్‌ఫాం వద్ద పగిలిన మెట్లు

వైభవంగా గోవిందుడి జ్యేష్ఠాభిషేకం ప్రారంభం




ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు, మాడవీధుల్లో ప్రోక్షణం చేస్తున్న అర్చకులు

తిరుపతి అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఆషాఢ మాసంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కవచాధివాసం చేశారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

తిరుపతి(ఆటోనగర్), జూలై6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రాష్ట్రంలో 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు ఆర్.హరికృష్ణ, మాధవ్, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభించిన నేతలు మాట్లాడుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొనాలని కోరారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయని పక్షంలో తిరుపతి నుంచే ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ర్యాలీ రైల్వేస్టేషన్ మీదుగా నేతాజీ రోడ్డు, బేరివీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌డీ రవి, సుబ్రమణ్యం, వెంకటరత్నం, వెంకయ్య, కెవై రాజా, లోకేష్, శివ, అల్లాబక్ష్, శివకుమార్, బుజ్జి, గంగాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు శ్లాఘనీయం

తిరుపతి(ఆటోనగర్), జూలై6(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు శ్లాఘనీయమని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఆహార సమస్య ఉత్పన్నమైన సమయంలో కేంద్ర మంత్రిగా జగ్జీవన్‌రామ్ తీసుకున్న నిర్ణయాలు అమోఘమన్నారు. బంగ్లాదేశ్ సమస్య పరిష్కారంలో చాకచక్యంగా వ్యవహరించారన్నారు. ఆయన స్ఫూర్తిగా ఉద్యోగులు విధులు నిర్వహించాలని సూచించారు. డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, జీఎం వై.వెంకట రాజు, అధికారులు జీవీఎస్ఆర్.మూర్తి, టి.మధుసూదన్, అంజనప్ప, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, నరసింహన్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న సంతోషరావు

వైభవంగా మలయాళస్వామి ఆరాధన

- తరలివచ్చిన పూర్వ విద్యార్థులు




ప్రత్యేక పూజలందుకున్న మలయాళస్వామి, మలయాళస్వామి అధిష్ఠానం ముందు పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యాసాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు మలయాళస్వామి 63వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మలయాళ స్వామి అధిష్ఠాన మందిరాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహోత్సవంలో సుమారు 400మంది పూర్వ విద్యార్థులు, ఏర్పేడు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. పూజల అనంతరం పూర్వ విద్యార్థులు భజనలు చేశారు. ఆశ్రమంలోని కాశీ బుగ్గను సందర్శించారు. ఈ ఉత్సవంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్, మాజీ డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, ఆశ్రమ కార్యదర్శి అమర్‌నాథరెడ్డి, ఆమందూరు సర్పంచ్ గుణయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌యాదవ్, వివిధ ఉద్యోగాల్లో ఉన్న అధికారులు పాల్గొన్నారు.

కపిలతీర్థంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపమూ రానీయకుండా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్రప్రతిష్ఠ నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజలు, హోమం చేపడతారు. బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వర స్వామి వార్లు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.




పుట్టమన్ను సేకరిస్తున్న పండితులు, మన్నును ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అర్చకులు

పుత్తూరు వార్తలు

అంజేరమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



వడమాలపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారి వడమాలపేట సమీపంలోని అంజేరమ్మ కనుమ వద్ద అంజేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చతురత, అమ్మవారి చలువ, ఆశీస్సులతో ఏడాది పాలన పూర్తయిందన్నారు. గంజి మాధవయ్య, యుగంధర్, ప్రతాప్ రాజు, కరుణాకరన్, ఎస్.ఎస్. ధనపాల్, డి.జి. ధనపాల్, బాబు నాయుడు, బాలాజి, వెంకటేష్, జయచంద్ర, గోపీనాథ్, కరుణాయాదవ్, రఫీ, నబీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఆశా కార్యకర్తల డిమాండ్



కరపత్రాల ఆవిష్కరణలో ఆశా కార్యకర్తలు

పుత్తూరు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తమను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి, నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం యూనియన్ అధ్యక్షురాలు హేమావతి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... ఆశా కార్మికులను వైద్య సిబ్బందిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కరోనాలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఆశా కార్యకర్తలకు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీ బీమా పథకం కింద రూ.50 లక్షలు చెల్లిస్తామని వాగ్దానం చేసి రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. వాణి, ప్రసన్న, ధనలక్ష్మి, మారెమ్మ, పెంచలమ్మ, స్వర్ణ, వెంకటరమణ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే నివాళి

పుత్తూరు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మిట్టపల్లూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మురగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వర మంగళం ఏఏడబ్ల్యూలో నిర్వహిస్తున్న మాతమ్మ తిరునాళ్లలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ...

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఆదివారం జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, నాయకులు అరుణ, ప్రియాంక, కల్యాణమ్మ, పరంజ్యోతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన రాజమోహన్‌బాబు

వరదయ్యపాళెం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయవృత్తికే రాజమోహన్ బాబు వన్నె తెచ్చారని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ఆర్ఆర్ కల్యాణమండపంలో ఆదివారం ప్రధానోపాధ్యాయుడు రాజమోహన్‌బాబు పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలువురు ఆయన్ను సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, మునిభూషణమ్మ, దామోదర్‌రెడ్డి, మోహీద్దీన్, హరి గోపాల్‌రెడ్డి, సురేంద్రమూర్తి, కుమార్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 6: మండలంలోని గాజులపెళ్లూరు, వెస్ట్‌వరత్తూరు, కాటూటరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కంచనపుత్తూరు గ్రామాలలో మొహర్రంను పురస్కరించుకుని ముస్లింలు, హిందువులు పీర్లు మోశారు. దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో చావిడిలో పీర్లను నిలిపారు. బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు. పులువురు అగ్నిగుండంలో ప్రవేశించారు.

నవభారత్ నిర్మాణం బీజేపీతోనే సాధ్యం

పిచ్చాటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): నవభారత నిర్మాణం బీజేపీ సారథ్యంలోని పీఎం మోదీతో సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం పిచ్చాటూరులో బీజేపీ నూతన నాయకుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించనుందన్నారు. రాష్ట్రంలో కూటమి పాలనతో సంక్షేమం అభివృద్ధి సమ పాళ్లలో జరుగుతోందన్నారు. ఆనందనాయుడు, నెట్టేరి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా తప్పనిసరి

కేవీబీపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న పెంపుడు కుక్కలకు యజమానులు రేబిస్ టీకా తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి పార్తిబన్ చెప్పారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్‌డే సందర్భంగా మండలంలో పశువైద్య సిబ్బంది పర్యటించి సుమారు 46 కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. దీని ద్వారా కుక్కలు కరిచినా ప్రమాదం వాటిల్లదని ఆయనతెలిపారు. ప్రతి యజమాని ఇంజక్షన్లు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది డిల్లీకుమారి, వెంకటేష్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ అనారోగ్యానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక ఏఆర్‌డీ ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో కేవీ హస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్‌హెల్త్‌క్లబ్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టేడియంలో వసతుల మెరుగుకు కృషిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఓజిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో మౌలిక వసతుల కల్పన తొలి ప్రాధామ్యంగా పెట్టుకున్నట్లు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం తెలిపారు. భువనగిరిపాళెంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భువనగిరిపాళెంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. ఆర్టీసీ బస్ సౌకర్యంపై ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్ళి అధికారులతో మాట్లాడతామన్నారు. టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, శ్రీనివాసులరెడ్డి, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్, ధనుంజయరెడ్డి ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

హైవే దిగ్బంధం ఘటనలో 15 మందిపై కేసు

పెళ్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పునబాక రైస్‌మిల్లు గిరిజన కాలనీకి చెందిన అమాస దుర్గ (22) ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో పెళ్లకూరు జాతీయ రహదారిపై శుక్రవారం మృతదేహంతో ఆందోళన చేసిన 15 మందిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మరికొంత మందిని గుర్తించే పనిలో ఉన్నట్లు సమాచారం. చట్ట విరుద్ధంగా జాతీయ రహదారులపై గుమికూడి వాహనాలను అడ్డుకుని నిరసన కార్యక్రమాలను చేపడితే చర్యలు తప్పవని ఎస్ఐ నాగరాజు స్పష్టం చేశారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడని బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అనంతరం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, నరేంద్ర, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ యత్నం సీసీ కెమెరాల ధ్వంసం



గూడలికొండపై పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్

కోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గూడలితిప్పపై పర్వతవర్ధిని సమేత భీమేశ్వర ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. కొంతమంది తిప్ప మీద జన్మదిన వేడుకలు జరుపుకొని ఆలయ గోడలు దూకి లోపలకు ప్రవేశించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గర్భగుడిలోకి వెళ్లి విలువైన వస్తువులు అపహరించేందుకు విఫలయత్నం చేశారు. దీంతో ఆలయం వెలుపల కొన్ని సీసీకెమెరాలను ధ్వంసం చేసి రెండింటిని అపహరించుకు వెళ్లారు. ప్రధాన అర్చకుడు ఫిర్యాదుతో ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్ పరిశీలించింది.

విద్యార్థిని విషాదాంతం

● కరూలు జిల్లా బనవాసి కళాశాలలో ఆత్మహత్య



మృతి చెందిన రిషిత

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఏపీఆర్ జేసీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న రిషిత (17) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కళాశాల అధికారులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన మస్తానయ్య, మంజుల కుమార్తె రిషితకు బైపీసీ గ్రూపులో సీటు వచ్చింది. వారం రోజుల క్రితం రిషిత తల్లిదండ్రులు బనవాసి కళాశాలలో వదిలివెళ్లారు. ఇక్కడ ఉండలేనని రోజూ తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుండేది. దీంతో ఆదివారం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి సాయంత్రం వరకు రిషితతో గడిపారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని రిషితమానసిక ఆందోళనకు గురై, రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్ బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకుంది. కాసేపటి తర్వాత కళాశాల వర్గాలు గుర్తించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్యలత సమాచారంతో పోలీసు చేరుకొని బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వారు నిర్ధారించారు.

క్లూస్ టీమ్ పరిశీలనలో బయటపడిన నగదు

నాయుడుపేటటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ సెంటర్ సమీపంలో ఓ ఇంట్లో శనివారం చోరీ సంఘటనకు సంబంధించి తిరుపతికి చెందిన క్లూస్ టీం ఆదివారం పరిశీలించింది. బాధిత కుటుంబ సభ్యులు రూ.3లక్షల నగదు, 55 సవర్ల బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో భాగంగా క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరిస్తుండగా, బీరువాలో రూ.2.50 లక్షల నగదును గుర్తించినట్లు సీఐ బాబి తెలిపారు. దీంతో ఎంత మేర చోరి జరిగిందనే కోణంలో పోలీసుల విచారిస్తున్నారు. ఎస్ఐలు దస్తగిరి, ప్రకాష్‌లు పాల్గొని వేలిముద్రల సేకరించారు.

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణ తేజ సర్కిల్ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గోతుల రహదారిలో నిత్యం ఇబ్బందులు



గూడూరు నుంచి విందూరు మార్గమంతా ఇలాంటి గోతులే

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరు-మిటాత్మకూరు రహదారి గోతులమయంగా తయారైంది. దీంతో ఈమార్గంలో ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సుమారు 18 కిలోమీటర్ల పరిధి ఉన్న ఈరహదారిలో మిటాత్మకూరు, పగడాలపల్లి, ఈదలపల్లి, సంతదాసుపల్లి, చెంబడిపాళెం, రామలింగాపురం, విందూరు, వేములపాళెం తదితర గ్రామాల ప్రజలు నిత్యం గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనులకు వెళ్లే వారికి ఈ గ్రామీణ రహదారి ఆధారం. గూడూరులో పనులు ముగించుకుని రాత్రి సమయంలోగ్రామాలకు చేరుకుంటారు గోతులమయమైన ఈదారిలో రాకపోకలంటే భయపడిపోతున్నారు. రోడ్డు వెంబడి 15 వరకు మలుపులున్నాయి. ఇక్క వద్ద ఎటువంటి వేగనిరోధకాలు, సూచికబోర్డులను లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల్లో కూడా రోడ్డు గోతులమయంగా మారింది. రాత్రి సమయంలో గుంతలు కనిపించక వాహనచోదకులు పడిపోతున్నారు. మూడురోజుల క్రితం విందూరు సమీపంలో ఆటో బోల్తాపడడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధిపరచాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా వేములపాళెం మలుపు

సార్వత్రిక సమ్మె జయప్రదానికి వామపక్షాల పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్, డీపీ పోలయ్య, సీవీఆర్‌కుమార్, శశికుమార్, నారాయణ, సునీల్, యాకోబు, చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు. **గూడూరు అర్బన్:** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లు కార్మిక వర్గానికి మరణశాసనంలాంటివని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీరమణయ్య, మణి, ఇంద్రావతి, ప్రభావతి, సుబ్బయ్య, రామయ్య, ప్రసాద్, మధు, ముత్యాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం సుపరిపాలనతో తొలి అడుగు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ నిర్మాణం ప్రారంభానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. పారిశుధ్యం గురించి పట్టించుకోవాలని ఆప్రాంత వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపల్ కమిషనరును పిలిపించి పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. నేతలు గంగోటి నాగేశ్వరరావు, పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, గంగాధర్, సత్యనారాయణ ఉన్నారు. **బాలాయపల్లి:** ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే కురుగిండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని కడగుంటలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగారు .ఏడాదిపాలనలో చేపట్టిన అబివృది పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కడగుంట లో రూ.62 లక్షలతో అబివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకయ్య. మండలపార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, జన్నిరమణయ్య గంగోటి నాగేశ్వరావు, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెర్రికాలువపై లాక్‌ల రిపేర్లతో కడగండ్లు



వరదల సమయంలో కొట్టుకుపోయిన లాక్

దొరవారిసత్రం, జూలై6(ఆంధ్రజ్యోతి): టపాయిండ్లు వద్ద నెర్రికాలువపై లాక్‌లు మరమ్మతులకు గురయ్యాయి. లింగంపాడు చెరువుకు నెర్రికాలువ నీటిని మళ్ళించాలంటే కాలువపై లాక్‌లను మూసివేయాల్సి ఉంటుంది. నాలుగు లాక్‌ల్లో ఒకటి పూర్తిగా వరదల సమయంలో కొట్టుకుపోయింది. మిగిలిన మూడు మరమ్మతులకు గురై తెరుచుకోవడంలేదు. వరదొస్తే నీరు లింగంపాడు చెరువుపైబడి దిగువ గ్రామాల్లోకి వెళుతుంది. సాగు నీటి కోసం రైతులు లాక్‌ల వద్ద ఆనకట్టలను కట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం తెలుగుగంగ నీరు వస్తున్నా చెరువులకు మళ్లించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి లాక్‌లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పూర్తిగా లేని గేట్‌లో లాక్‌ను ఏర్పాటు చేయాలంటున్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అట్రాసిటి కేసుపై విచారణ



దుకాణదారులను విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు పీహెచ్‌సీ సమీపంలో యాగాన్ని బెన్నీ అనే దళితుడుపై జరిగిన దాడి కేసు విషయంలో అట్రాసిటీ కేసుపై ఆదివారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విచారణ చేపట్టారు. పలువురు దుకాణదారులను విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి సందర్భంగా స్థానిక బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య భవనంలో ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతపూజలను నిర్వహించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు శిరోమణిశర్మ సహకారంతో వ్రతపూజలు నిర్వహించి వ్రత శిష్టితను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, అనిమెళ్ల శివకుమార్, రామ్మూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోట: గూడలిలోని జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం తొలిఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్దనస్వామి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. గూడలితోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రైతులు స్వర్ణముఖినదిలో పంటల కోసం పూజలు చేశారు

సూళ్లూరుపేట: స్థానిక పార్కువీధిలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయం, షార్ బస్టాండు వద్ద ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

గూడూరులో మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం



గూడూరులో కరచాలనం చేస్తున్న మంత్రి లోకేశ్- రేణిగుంట విమానాశ్రయం వద్ద లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ(సూళ్లూరుపేట), కురుగొండ్ల రామకృష్ణ(వెంకటగిరి)

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పర్యటనకు వెళ్తున్న టీడీడీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి ఆయన నెల్లూరుకు రోడ్డు మార్గంలో బయలుదేరారు. గూడూరులోని జాతీయ రహదారి పోటుపాళెం కూడలి వద్ద మంత్రికి పెద్దఎత్తున నాయకులు, స్వాగతం పలికారు. కారులో నుంచి పలువురు నాయకులకు, కార్యకర్తలతో ఆయన కరచాలం చేశారు. ఆప్యాయంగా పలకరించారు. నాయకులు నానాజీ, కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివారం వస్తే ఇక్కడి సంతతో అవస్థలే

● మన్నారుపోలూరు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ చిక్కులు

సూళ్లూరుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు జంక్షన్ ప్రధాన రోడ్డులో ఆదివారం సంతలో వాహన రాకపోకలతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఆదివారం తమిళనాడు, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు వచ్చి సంత పెడుతున్నారు. రోడ్డు పక్కన ఇరువైపులా సంతలో అరకిలోమీటరు మేర వాహనాలు నిలిపి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కూడా వస్తువులను రోడ్డుపైనే ఉంచుతున్నారు. కొనుగోలు దారులతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. మోటారు సైకిల్, పాదచారులు వెళ్లలేని పరిస్థితి. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో మన్నారుపోలూరు విస్తరించింది. టిడ్కో ఇళ్ల సముదాయం, ఎన్టీఆర్ నివాసం కేంద్రం ఇళ్లు కూడా ఆ ప్రాంతంలోనే ఉన్నాయి.

తిరుపతి-తిరుమల, శ్రీకాళహస్తిలకు పడమటి పల్లెలక ప్రజలు కూడా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్టీసీ బస్సులు. కంపెనీలకు వెళ్లే వాహనాలకూ ఇదే మార్గం. ప్రధాన రోడ్డులోనే కాకుండా అలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయ రోడ్డులో కూడా సంత పెట్టడంతో స్థానికులకు ఇబ్బంది కలుగుతోంది. మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు స్పందించి సంతను మరో చోట ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదివారం సంత జరుగుతున్నప్పుడు ఎదురెదురు వాహనాలు తప్పించుకోవాలంటే కష్టమే..!

మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు సుధీర్, భానుప్రకాష్

రేణిగుంట జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం లభించింది. నెల్లూరు జిల్లాలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగిరి, సత్యవేడు, ఎమ్మెల్యేలు సుధీర్, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, ఆదిమూలం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, రాష్ట్ర హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు తదితరులు స్వాగతం పలికారు. అలిపిరి నడక మార్గంలో వైసీసీ హయాంలో ఏర్పాటు చేసిన దుకాణాలపై విచారణ చేపట్టాలంటూ టీడీపీ యాదవ సంఘ నాయకుడు ఆర్ఆర్ యాదవ్ మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

వైభవంగా మలయాళస్వామి ఆరాధన

● తరలి వచ్చిన పూర్వవిద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో మలయాళస్వామి - పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న వ్యాసాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు మలయాళస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మలయాళస్వామి అధిష్ఠాన మందిరాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ ఆరాధన మహోత్సవంలో సుమారు 400మంది పూర్వ విద్యార్థులు, ఏర్పేడు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. పూజల అనంతరం పూర్వ విద్యార్థులు భజనలు చేశారు. ఆశ్రమంలో ఉన్న కాశీబుగ్గను సందర్శించారు. మలయాళస్వామి 63వ ఆరాధన మహోత్సవంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్, మాజీ డైరెక్టర్ వెంకట రమణారెడ్డి, వివిధ ఉద్యోగాల్లో ఉన్న అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆశ్రమ కార్యదర్శి అమర్‌నాథ రెడ్డి, ఆమందూరు సర్పంచ్ గుణయాదవ్, ఎంపీటీసీ సభ్యు డు చంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నా రు.

మలయాళస్వామి కృషితోనే...

వ్యాసాశ్రమ స్థాపకుడు మలయాళస్వామి కృషితోనే తామంతా ఉన్నత శిఖరాలకు చేరుకున్నామని ఆశ్రమ పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఏర్పేడులోని ప్రైవేటు పాఠశాలలో ఆదివారం 1965 నుంచి 2000 మధ్య వ్యాసాశ్రమంలో చదువుకున్న విద్యార్థులు భేటీ అయ్యారు. ఈసందర్భంగా విఠపు మాట్లాడుతూ మలయాళస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే సుధీర్ సహకారంతో ఏర్పేడు పట్టణంలో త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. వెంకటరమణారెడ్డి, గాలి రవి, సత్యం, మేధావులు పాల్గొన్నారు.

వాలీశ్వరస్వామి సేవలో కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారి

పిచ్చాటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి వాలీశ్వరస్వామి సేవలో కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారి సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పాల్గొన్నారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వేంచేసిన ఆయనకు ఆలయ ఈవో హేమచంద్రరావు, ప్రధాన అర్చకుడు శంకరరాజ్ గురుకుల్ స్వాగతం పలికి సపర్యలు చేశారు. ఈ సందర్భంగా సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి వాలీశ్వరస్వామి, కాళభైరవస్వామి, మరగదాంబిగ అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో పుష్కరిణిలోని నందీ తీర్థాన్ని సేవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రాచీనమైన ఈ గుడి విశిష్ట దేవాలయమన్నారు. పల్లవుల కాలం నాటి ఆలయ స్థల పురాణం, విశిష్టతలను ఆలయ అర్చకుడు శంకర రాజ్ గురుకుల్ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారికి వివరించారు. ఏడాది ఏప్రిల్ 30న శ్రీ కంచి కామకోటి పీఠాధిపతిగాదీక్షను స్వీకరించి శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు అనతి కాలంలోనే రామగిరి ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని అర్చకులు, ఆలయ ఈవో తెలిపారు.



దర్శనానికి వెళ్తున్న సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి

సంక్షేమమే టీడీపీ ధ్యేయం



మహిళలను ఆశీర్వదిస్తున్న సుధీర్ - ప్రజలతో మాట్లాడతున్న మునిరాజానాయుడు

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని జగ్గరాజుపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను వివరించారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. చెంచయ్యనాయుడు, కృష్ణయాదవ్, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీ గుర్రప్పనాయుడు కండ్రిగలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. మునిరాజానాయుడు, లెక్కల మురళీ నాయుడు, సింగమాల భాస్కర్, పవన్‌నాయుడు, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. మండలంలోని బండారుపల్లిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా స్థానిక నాయకులతో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. రాష్ట్రాన్ని జగన్ అప్పులపాటు చేశాడని ఆ లోటును పూడ్చడానికి సీఎం శ్రమిస్తున్నారన్నారు. సుబ్రహ్మణ్యంయాదవ్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే వినతి

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే సుధీర్ కోరారు. తిరుపతి పర్యటనకు విచ్చేసిన ఆయన్ను ఎమ్మెల్యే ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

భక్తిశ్రద్ధలతో పొంగళ్లు - అగ్నిగుండ ప్రవేశానికి పోటెత్తిన భక్తజనం





భీమసేనుడి ఊరేగింపు - భీమ, దుర్యోధనుల పోరాటం - ద్రౌపది కురులకు రక్తంతో ముడి - భక్తుల పొంగళ్లు

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపది సమేత ధర్మారాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం జరిగిన దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టాలు అద్వితీయంగా సాగాయి. ఆ తరువాత భక్తులు పొంగళ్లు పెట్టారు. పది రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి మహాభారత యుద్ధం ముగింపు సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.



ధర్మరాజ ఆలయంలో భక్తజన సందోహం

అగ్నిగుండ ప్రవేశం

ఆదివారం ఉదయం ముక్కంటి ఆలయ అధికారుల ఆధ్వర్యంలో అగ్ని గుండానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అగ్గిని వెలిగించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవాన్ని ఎమ్మెల్యే సుధీర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆలయ ఈవో బాపిరెడ్డి ప్రారంభించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం ద్రౌపదీదేవి వాహనంపై అగ్నిగుండం వద్దకు వేం చేశారు. శాంతి పూజల అనంతరం భక్తులకు అగ్నిగుండ ప్రవేశం కల్పించారు. 4,394 మంది పసుపు దుస్తులు, కంకణాలు ధరించి వేప మండలు చేతబట్టి పూల కిరీటాలు, కళ్లకు కాటుకతో క్యూకట్టారు. గోవింద నామ స్మరణతో అగ్ని గుండంలో నడుస్తూ ఎదురుగా వాహనంపై ఆసీనులైన ద్రౌపదీదేవిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

తొలుత ద్రౌపదీ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండం చుట్టూ అష్టదిక్పాలుర పూజ, నైవేద్యం సమర్పించి గుమ్మడికాయను దిష్టిగా నరికారు. ఆ తరువాత అగ్నిగుండం చివరి భాగాన పాలు ఏర్పాటు చేశారు. తరువాత గుండం నుంచి నిప్పు కణికలను తీసుకుని ద్రౌపదీ అమ్మవారి ఒడిలో కట్టారు. గుండంలోకి ప్రధాన అర్చకులు మల్లెపూల చెండు విసిరారు. ఆ తరువాత ఆలయం తరఫున కలశం, పోతురాజు, గెరికను తీసుకుని అగ్నిగుండం ప్రవేశించారు. వీరి వెంట భక్తులు అగ్నిగుండంలో దిగారు.

సమన్వయలోపం...

అగ్నిగుండ మహోత్సవం ఆద్యంతం గందరగోళంగా జరిగింది. ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ విఫలమైనట్లు భక్తులు పెదవి విరిచారు. ఆలయం వద్దకు వాహనాలను యథేచ్ఛగా అనుమతించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రధానంగా మధ్యాహ్నం పొంగళ్ల సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం రహదారులన్నీ స్తంభించాయి. ఆలయం నుంచి ద్రౌపదీదేవి ఉత్సవమూర్తి అగ్నిగుండం వద్దకు చేరుకునే సమయంలో అడ్డదారిలో దూరేవారిని భద్రతా సిబ్బంది నిలువరించలేకపోయారు.

పోలీసుశాఖ ఘోర వైఫల్యం

పోలీసుశాఖ అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంలో ఆదివారం ఘోరంగా విఫలమైనట్లు భక్తుల నుంచి బాహాటంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. పోలీసులు, సిబ్బంది తమకు అయిన వారిని ఇష్టానుసారం అగ్నిగుండం వద్దకు అనుమతిచండంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ధర్మరాజస్వామి ఆలయం నుంచి వీఎంసీ సర్కిల్, ముక్కంటి ఆలయం వరకు, నాయుడుపేట రోడ్డు, అగ్నిమాపక కూడలిలో ట్రాఫిక్ సమస్య తప్పలేదు. వాహనాలు స్తంభించిపోవడంతో పట్టణవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.



అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తీసుకొస్తున్న ఎమ్మెల్యే తదితరులు - అగ్ని గుండం ప్రారంభం - మల్లెపూల చెండును దొర్లిస్తున్న భక్తుడు - ప్రవేశిస్తున్న భక్తులు

అన్నదానం



అన్నదానం చేస్తున్న విజయ స్టీల్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): భక్తుల సేవతోనే సంతృప్తి అని విజయస్టీల్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ నిర్వాహకులు అన్నారు. పట్టణంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని ధర్మరాజస్వామి ఆలయానికి సమీపంలో వీఎంసీ కూడలి వద్ద విజయ స్టీల్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. పది సంవత్సరాల నుంచి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. విజయయాదవ్, బాలుయాదవ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

● అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరై భక్తులకు వడ్డించారు. 15 సంవత్సరాలుగా అన్నదానం చేస్తున్నట్లు లారీ యజమానులు తెలిపారు.

● జనసేన నాయకులు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, ప్రతాప్, చిరంజీవి, పేట చంద్ర, సూరిబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ అధ్యక్షుడిగా పార్థసారథి

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది పసుపులేటి పార్థసారథి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ హాజరయ్యారు. కార్యదర్శిగా సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీకి మాజీ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాబు జగ్జీవన్‌రాంకు నివాళులు

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రాం వర్ధంతిని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. సురేంద్రరెడ్డి, ఆంటోని, చందు, పురుషోత్తం, సారథి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

9న అఖిల భారత సమ్మె

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత స్థాయిలో ఈనెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ పిలుపునిచ్చారు. మండలంలోని కుక్కంబాకంలో వ్యవసాయ కార్మిక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, వ్యకా.స జిల్లా ఉపాధ్యక్షుడు రమణయ్య, జేకే రమణయ్య, కృష్ణమ్మ పాల్గొన్నారు.

మంత్రిగారూ... సమస్యలు పరిష్కరించరూ!

సత్యవేడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో నేడు సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సత్యవేడులో జరగనున్న 'సుపరిపాలన తొలి అడుగు'లో పాల్గొననున్నారు. మంత్రి తొలిసారిగా నియోజకవర్గంలో పర్యటించ నున్న నేపథ్యంలో నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇవీ సమస్యలు...

● ప్రధానంగా నియోజకవర్గంలో రెవెన్యూ, అటవీశాఖ భూముల వివాదం చాలా కాలంగా కొనసాగుతోంది. సత్యవేడు, కేవీబీపురం, నారాయణవనం, నాగలాపురం, బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం మండలాల్లో పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖ అధికారులు తమ శాఖవి అంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి, సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ● నియోజకవర్గంలో రెవెన్యూ సిబ్బంది కొరతవల్ల భూ సమస్యలు పేరుకుపోతున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షాలకే ఉరుస్తూ రికార్డులు తడిసి పోతున్నాయి. నూతనంగా తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించాల్సి ఉంది. ● నియోజకవర్గంలోని మూడు మండలాలు ఒక రెవెన్యూ డివిజన్‌లో, నాలుగు మండలాలు మరో డివిజన్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు సత్యవేడులోనే ఆర్డీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమసయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ● నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి అవినీతి తారస్థాయికి చేరిందన్న విమర్శలు ఉన్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రక్షాళన చేపట్టాలి.

చిట్టీల డబ్బు చెల్లించడంలో వివాదం

పోలీస్‌స్టేషన్ ముందు ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

రేణిగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ ముందు ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... గణేష్ వద్ద తాను చిట్టీలు కట్టానని, కాలపరిమితి ముగిసినా డబ్బు చెల్లించకపోగా అడిగితే బెదిరిస్తున్నాడంటూ మండలంలోని కృష్ణాపురానికి చెందిన షణ్ముగం ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం గణేష్‌ను స్టేషన్‌కు రావాలని పోలీసులు పిలిచారు. గణేష్ తన భార్య లక్ష్మి, మామ వెంకటమునితో చేరుకున్నాడు. కొంతసేపటి తరువాత తనతో తెచ్చుకున్న పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు అడ్డుకున్నారు. తాను ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నానని, అప్పులు ఉన్నాయని, చిట్టీల డబ్బు ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారంటూ గణేష్ చెప్పారు. పోలీసులు చేసేది లేక గణేష్‌ను భార్య, మామతో పంపిచేశారు. ఈ ఘటనపై షణ్ముగం ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ చేపట్టి చట్టప్రకారం ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

శ్రీకాళహస్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో కొలువై ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కాగా స్వామివారిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి బోరు

ఏర్పేడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతి కండ్రిగ పంచాయతీ ఎలకమెట్ట గిరిజన కాలనీలో ఎమ్మెల్యే సుధీర్ చొరవతో ఆదివారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సరస్వతి కండ్రిగలో పర్యటించిన టీడీపీ నాయకులను స్థానిక మహిళలు తమకు తాగునీటి బోరును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆదివారం బోరును ఏర్పాటు చేసి వారి దాహార్తిని తీర్చారు.



ఘనంగా గంగమ్మ జాతర

కేవీబీపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగలో ఆదివారం గంగమ్మ జాతర సర్పంచు చెంచు ప్రకాష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.